
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు
5
శుక్రవారం 12 జనవరి 2024





వెల్దుర్తిలో ఈ-కేవైసీ చేయించుకుంటున్న లబ్ధిదారుడు

- ఈ నెలాఖరుతో ముగియనున్న పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం
- ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా లేని ప్రభుత్వం
- పార్లమెంట్ ఎన్నికలపై ఫోకస్
- ప్రత్యేకాధికారులను నియమించడానికే మొగ్గు

స్పెషల్ ఆఫీసర్ల పాలన ఖాయమేనా?



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 11 : గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన తప్పేలా లేదు. ప్రస్తుత సర్పంచ్‌ల ఐదేళ్ల పదవీ కాలం ఈ నెల 31తో ముగియనున్నది. పంచాయతీ ఎన్నికల దిశగా ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణ ప్రారంభం కాకపోవడంతో పంచాయతీల నిర్వహణ బాధ్యత స్పెషలాఫీసర్లకు అప్పజెప్పడం ఖాయమని తెలుస్తున్నది. ఐదేళ్ల క్రితం రాష్ట్రంలో 2019 జనవరి 21, 25, 30 తేదీల్లో మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికైన సర్పంచ్, పంచాయతీ పాలకవర్గాలు ఫిబ్రవరి 2న బాధ్యతలు స్వీకరించారు. దీంతో వారి ఐదేళ్ల పదవీకాలం దాదాపు ముగింపునకు వచ్చింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం పంచాయతీల ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం కసరత్తు మొదలుపెట్టింది. సంగారెడ్డి జిల్లాలోని 647 గ్రామ పంచాయతీలు, 5,778 వార్డుల్లో ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన సిబ్బంది వివరాలను గత నెల మూడో వారంలో సేకరించింది. ఓటర్ల సంఖ్యను గుర్తించడంతో పాటు 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం చొప్పున ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఎన్నికల నిర్వహణకు 428 మంది సిబ్బంది అవసరమవుతారని గుర్తించిన యంత్రాంగం అందుకు తగ్గ ఏర్పాట్లను ప్రారంభించింది.

ఎన్నికల నిర్వహణకు సర్కారు 'నో'?

జిల్లా యంత్రాంగం కసరత్తు మొదలుపెట్టినా ప్రభుత్వం నుంచి పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఎటువంటి ఆదేశాలు రాలేదు. 18 రోజుల్లో సర్పంచ్ పదవీకాలం ముగుస్తున్నా ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నుంచి సూచనలు రాలేదు. పైగా ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధంగా లేదన్న అనధికారిక సమాచారం జిల్లా యంత్రాంగానికి వచ్చినట్టు తెలిసింది. ప్రస్తుత సర్పంచ్‌లలో ఎక్కువమంది బీఆర్‌ఎస్ కావడంతో వారి పదవీకాలం ముగిసిన అనంతరం స్పెషల్ ఆఫీసర్లను నియమించాలన్న భావనతో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. స్పెషల్ ఆఫీసర్లుగా నియమించేందుకు అర్హులైన పంచాయతీరాజ్, రెవెన్యూ విభాగాలోని జూనియర్, సీనియర్ అసిస్టెంట్లతో పాటు ఎంపీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్ల వివరాలను పంపించాలని జిల్లా యంత్రాంగం ఆయా విభాగాల అధికారులను కోరినట్టు తెలిసింది. జిల్లాలోని 647 గ్రామ పంచాయతీలకు పంచాయతీల గ్రేడ్‌లను బట్టి నియమించాల్సిన స్పెషల్ ఆఫీసర్ల జాబితాను ఈ నెలాఖరులోగా యంత్రాంగం సిద్ధం చేసే అవకాశం ఉన్నది.

లోక్‌సభ ఎన్నికలే టార్గెట్

షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి నెలాఖరు లేదా మార్చి మొదటి వారంలో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉన్నది. కాంగ్రెస్‌తో పాటు బీఆర్‌ఎస్, బీజేపీ తదితర రాజకీయ పక్షాలు లోక్‌సభ ఎన్నికలపైనే దృష్టి కేంద్రీకరించాయి. పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులను ఖరారు చేయడం, గెలుపు వ్యూహాలను రూపొందించడంపై పార్టీలు ఫోకస్ చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణ తలనొప్పి ఎందుకని ప్రభుత్వం అభిప్రాయపడుతున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. అసలే ఆర్థిక ఇబ్బందులతో ఉన్న ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేయడం అనవసరమన్న భావనతో ఉన్నట్టు ఆ వర్గాలు తెలిపాయి.



రేషన్ ఈ-కేవైసీకి

నెలాఖరు వరకే గడువు!

- జనవరి 31 వరకు అవకాశం
- మెదక్ జిల్లాలో 65.20 శాతం పూర్తి
- 2,13,873 రేషన్‌కార్డులు, 6,86,452 మంది లబ్ధిదారులు
- ఈ-కేవైసీ చేయించుకున్నవారు 4,47,559 మంది


ఆంధ్రజ్యోతి ప్రతినిధి, మెదక్, జనవరి 11: మెదక్ జిల్లాలో రేషన్ లబ్ధిదారులకు ఈ-కేవైసీని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఆహారభద్రత కార్డులోని సభ్యులందరూ సంబంధిత రేషన్ దుకాణానికి వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలని పౌరసరఫరాలశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ-కేవైసీ కోసం పలు మార్లు గడువు పొడిగించిన అధికారులు ఈసారి జనవరి 31 వరకు అవకాశమిచ్చారు. ఈ నెలాఖరు లోపు ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తిచేయాలని పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆదేశించారు. ఈమేరకు ఆహారభద్రత కార్డు కలిగిన ప్రతీఒక్కరి వేలిముద్రలను రేషన్ డీలర్లు సేకరిస్తున్నారు.

బోగస్‌కార్డుల ఏరివేతకే ఈ-కేవైసీ

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం ద్వారా అన్ని రాష్ట్రాలో ప్రస్తుతం ఉచితంగా రేషన్ ఇస్తున్న సంగతి తెలిసిందే. దేశంలో చాలావరకు బోగస్ రేషన్‌కార్డులు ఉన్నట్లు గుర్తించిన కేంద్రం ఆధార్ నంబర్‌తో ఈ-కేవైసీ చేయాలని సూచించింది. ఈ-కేవైసీ పూర్తి చేసుకోకుంటే రేషన్ అందదని చెప్పడంతో కార్డుదారులందరూ రేషన్ దుకాణాలకు పరుగులు పెడుతున్నారు. ఈ నెలాఖరు లోగా ఈ-కేవైసీ చేసుకుంటే రేషన్ సరుకులు నిలిచిపోవడంతో పాటు సదరు కార్డులను బోగస్‌గా భావించి తొలగించే అవకాశం ఉండడంతో తప్పనిసరిగా ఈ-కేవైసీ చేసుకుంటున్నారు. ప్రస్తుతం రేషన్‌కార్డుల్లో పేరున్నవారిలో చాలామంది చనిపోయారు. అయినా మృతుల పేరిట కుటుంబ సభ్యులు రేషన్ సరుకులు తీసుకుంటున్నారు. ఆడపడచులు పెళ్లై అంతారింటికి వెళ్లినా తల్లిగారింటి వద్ద రేషన్ బియ్యం తీసుకుంటున్నారు. ఈ-కేవైసీ తప్పనిసరి చేయడంతో నిజమైన లబ్ధిదారులకే రేషన్ సరుకులు అందే అవకాశం ఉంటుంది.

ఈ-కేవైసీ చేసుకోనివారు 35 శాతం

మెదక్ జిల్లాలో ఇప్పటికే 65.20 శాతం ఈ-కేవైసీ పూర్తయ్యింది. మిగిలిన వాళ్లు సమీపంలో ఉన్న రేషన్ దుకాణానికి వెళ్లి బాయోమెట్రిక్ విధానంలో ఈ-కేవైసీ చేయించుకోవాలి. జిల్లాలో మొత్తం 520 రేషన్ దుకాణాల్లో 2,13,873 ఆహారభద్రత కార్డులు ఉన్నాయి. ఆయా కార్డులపై 6,86,452 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో ఇప్పటికే 4,47,559 మంది సభ్యులు ఈకేవైసీ చేయించుకున్నారు. ఇంకా 2,38,986 సభ్యులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉన్నది.



నర్సాపూర్‌లోని రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ నమోదు చేయించుకుంటున్న మహిళ



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- సన్నాహక సమావేశంలో మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా నిర్దేశం

మెదక్ అర్బన్, జనవరి 11: పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో గురువారం ఆయన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, సంగారెడ్డి, పటాన్‌చెరువు నియోజకవర్గాల మ్యాపింగ్ తయారు చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఫాం-6, ఫాం-8 దరఖాస్తులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. 'స్వీప్' కార్యక్రమాలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఎన్నికల సిబ్బందిని నియమించడానికి ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఎస్ఎస్‌టీ, ఏటీ, వీఎస్‌టీ, ఎఫ్ఎస్, ఎంసీసీ తదితర బృందాలను పకడ్బందీగా నియమించాలని ఆదేశించారు. ఏడు నియోజకవర్గాలకు నోడల్ అధికారుల నియామకం పూర్తి చేయాలని నిర్దేశించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ సెంటర్లను గుర్తించి అధికారులు పరిశీలించాలని సూచించారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, వివరాలను సరిచూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, బీఎల్‌వోలకు శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. మొదటి, రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి చేయాలని, పోస్టల్ బ్యాలెట్, ఫాం 12ను పూర్తిచేయాలని, ఓటరు తుది జాబితాకు సిద్ధం చేయాలని అధికారులకు నిర్దేశించారు.కార్యక్రమంలో ఎస్పీ బాలస్వామి, మెదక్, సిద్దిపేట అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

- అపరిచితుల కాల్స్, మెసేజ్‌లకు స్పందించ వద్దు
- సెల్‌ఫోన్‌కు వచ్చిన అనవసరమైన లింక్‌లు తెరవొద్దు
- ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎవరికీ చెప్పవద్దు : సైబర్ క్రైం ఏడీజీ షిఖగోయల్

మెదక్ అర్బన్, జనవరి 11: సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సైబర్ క్రైం ఏడీజీ షిఖగోయల్ అన్ని జిల్లాల ఎస్పీ, సీపీలతోపాటు జిల్లా పోలీసు అధికారులకు సూచించారు. గురువారం సైబర్ నేరాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెక్నాలజీని వాడుకొని నేరగాళ్లు, ప్రజలకు తెలియకుండానే వారి డబ్బులను దోచుకుంటున్నారని పేర్కొన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర యాప్‌లు, లింకులు, ఈ -మెయిల్స్‌తో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. పోలీసులు ఇటువంటి నేరాలపై దృష్టి సారించాలన్నారు. ప్రజలు మోసగాళ్ల ఉచ్చులో పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నకిలీ కస్టమర్‌కేర్ నంబర్లతో జాగ్రత్తగా ఉండాలని, ఓటీపీ, పాస్‌వర్డ్‌లు ఎవరడిగినా చెపొద్దన్నారు. మోసపోతే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్‌నేరాల నియంత్రణపై ప్రత్యేక మాడ్యూల్‌ను రూపొందించి శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లా ఎస్పీ డా.బాలస్వామి, జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ సుభాష్‌చంద్రబోసు, సీఐ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎస్‌వీ కళాశాలలో 18న జాబ్‌డ్రైవ్

- డీఐఈవో గోవిందరామ్

సంగారెడ్డి అర్బన్, జనవరి 11 : సంగారెడ్డిలోని ఎస్‌వీ జూనియర్ కళాశాలలో ఈ నెల 18 న హెచ్‌సీఎల్ టెక్-బీ ఆధ్వర్యంలో జాబ్‌డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి(డీఐఈవో) గోవిందరామ్ ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగ అవకాశాలు పొందాలనుకునే ఇంటర్ విద్యార్థులు హాజరుకావాలని పేర్కొన్నారు. ఎంపీసీ, ఎంఈసీతో ఇంటర్ పూర్తిచేసుకున్న విద్యార్థులు ఓవరాల్ 75 శాతం,మ్యాథమెటిక్స్‌లో 60 శాతం మార్కులు పొందిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. సంబంధిత విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకుని ఎంపికలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు 9063564875 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

వైభవోపేతంగా వేంకటేశ్వరుడి రథోత్సవం

- సంగారెడ్డి పట్టణంలో ఘనంగా ఊరేగింపు
- స్వామివారికి భక్తుల నీరాజనం
- హాజరైన దేవనాథజీయర్ స్వామి

సంగారెడ్డి అర్బన్, జనవరి 11 : సంగారెడ్డి పట్టణ శివారులోని శ్రీవైకుంఠపురంలో వెలసిన మహాలక్ష్మీ, గోదాసమేత విరాట్ వేంకటేశ్వరస్వామి రథయాత్ర గురువారం సాయంత్రం కన్నుల పండువగా కొనసాగింది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకందాడై వరదాచార్యులు పర్యవేక్షణలో యువవికాస్ ఆధ్వర్యంలో శ్రీవారి రథయాత్ర నిర్వహించారు. పట్టణంలోని పీఎస్‌ఆర్ గార్డెన్స్ నుంచి ప్రారంభమైన రథయాత్ర కలెక్టరేట్, ఐబీ, కొత్తబస్టాండ్, పాత బస్టాండ్ మీదుగా శ్రీవైకుంఠపురానికి చేరుకుంది. దేవనాథజీయర్ స్వామి ప్రత్యేక పూజలు, హారతి ఇచ్చి రథయాత్రను ప్రారంభించారు. రథోత్సవానికి భక్తులు నీరాజనం పలికారు. దారి పొడవునా రంగురంగుల ముగ్గులు, మహిళల కోలాటాలు, భజనలు, హనుమంతుడి భారీ విగ్రహం రథయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, డీఆర్‌వో నగేశ్ హాజరై రథయాత్రను లాగారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు అరుణకుమార్‌రాజ, దేవేందర్, వీరేందర్, సంతోష్, యువ వికాస్ సభ్యులు అశ్వంత్, వెంకట్‌రెడ్డి, పెద్దసంఖ్యలో భక్తులు, పట్టణవాసులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరుడి రథాన్ని లాగుతున్న భక్తులు, పాల్గొన్న దేవనాథజీయర్ స్వామి





వేంకటేశ్వరుడి రథయాత్రలో కేరళ వాయిద్యకారుల బృందం, భారీ హనుమాన్ విగ్రహం

పదవుల కోసం పైరవీలు

- నామినేటెడ్ పోస్టులపై నేతల కన్ను
- ముఖ్య నేతల చుట్టూ ప్రదక్షిణలు



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, మెదక్, జనవరి 11 : నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన కాంగ్రెస్ నేతల్లో ఉత్సాహాన్ని నింపింది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో పార్టీ కోసం అందరి సేవలు వినియోగించుకునే దిశగా సీఎం అడుగులు వేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో టిక్కెట్ ఆశించి భంగపడిన వారికి ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటామని రేవంత్ ఇటీవల ఏబీఎన్ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. ఇప్పటికే నామినేటేడ్ పదవులపై ఆశలు పెట్టుకున్న నేతలు ముఖ్యనేతలను కలుస్తున్నారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇంత కాలం పార్టీ కోసం కష్టపడిన వారందరూ నామినేటేడ్ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలలో ముఖ్యనేతలు పార్టీని వదిలి వెళ్లినా కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌తోనే ఉన్నారు. ఇప్పుడు పార్టీ అధికారంలోకి రావడంతో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నారు.

అందరి చూపూ కార్పొరేషన్ల పైనే

జిల్లాకు చెందిన పలువురు నేతలు కార్పొరేషన్ చైర్మన్ పదవుల కోసం పోటీ పడుతున్నారు. కాంగ్రెస్‌లో సీనియర్లుగా ఉంటూ జిల్లా, రాష్ట్ర స్థాయి పార్టీ పదవుల్లో కొనసాగినవారు ఇప్పుడు పార్టీలో లేరు. ఉన్నవారు కార్పొరేషన్ పదవులను దక్కించుకోవాలని చూస్తున్నారు. మెదక్ నియోజకవర్గంలో పార్టీ టిక్కెట్ రాలేదని కొందరు నేతలు బీఆర్‌ఎస్‌లోకి వెళ్లిపోయినా మిగిలినవారు అధిష్ఠానం సూచించిన అభ్యర్థి గెలుపుకోసం కష్టపడ్డారు. ఇప్పుడు నామినేటేడ్ పదవుల భర్తీకి సమయం రావడంతో నేతలందరూ ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకునే పనిలోపడ్డారు. మరోవైపు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన మంత్రి దామోదర్‌రాజనరిసింహ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావులను కూడా కలుస్తున్నారు. ఏదో ఒక పదవి ఇప్పించాలని కోరుతున్నారు. కనీసం జిల్లా స్థాయి లోనైనా గౌరవం ఉన్న పోస్ట్ ఇప్పించాలని కోరుతున్నట్లు సమాచారం.

రాష్ట్రస్థాయిలో 54 కార్పొరేషన్ పదువులు ఉన్నాయి. జిల్లా స్థాయిలో గ్రంథాలయ సంస్థ చైర్మన్, రైతు సమన్వయ కమిటి, ఆత్మకమిటీ చైర్మన్ తదితర పోస్టులు ఉన్నాయి. వీటితో పాటు మార్కెట్ కమిటీ, ఆలయ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్ పోస్టులు కూడా ఉన్నాయి. మెదక్ నియోజకవర్గం నుంచి సుప్రభాతరావు, ప్రభాకర్‌రెడ్డి, రామచంద్ర గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివా చౌదరి, నర్సాపూర్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ఆవుల రాజిరెడ్డితో పాటు ఆంజనేయులు గౌడ్, శేషసాయిరెడ్డి, సుహాసినీరెడ్డి, రవీందర్‌రెడ్డి తదితర నేతలతో పాటు వివిధ మండలాలకు చెందిన పలువురు సీనియర్లు కూడా నామినేటేడ్ పదవులను ఆశిస్తున్నారు.

లోక్‌సభ ఎన్నికలే టార్గెట్


వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు పోతున్నది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపే నామినేటేడ్ పదవులను భర్తీ చేసే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నది. ఉమ్మడి మెదక్ జిల్లాలో మెదక్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పార్టీ అధిష్టానం టార్గెట్‌గా పెట్టుకున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కష్టపడినవారికి నామినేటేడ్ పదవులను కట్టబెట్టి లోక్‌సభ ఎన్నికల్లో వారి సేవలు వినియోగించుకోవాలని కాంగ్రెస్ అధినాయకత్వం నిర్ణయించింది. ఈమేరకు అర్హులను ఎంపిక చేయాలని నిర్ణయించారు.


19 వరకు ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు


- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డి రూరల్, జనవరి 11 : ఓటరు నమోదు పై అవగాహన కల్పించేందుకు ఈ నెల 19 వరకు ప్రతీరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, గేటెడ్ కమ్యూనిటీలను ఈ ఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, సీఎస్‌ఆర్ నోడల్ అధికారి సందర్శిస్తారని పేర్కొన్నారు. పరిశ్రమల్లోనూ కార్మికులకు అవగాహన కార్యక్రమాలు ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 12న జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి ఓటరు జాబితాను చదివి వినిపించి జాబితాలో అర్హులైనవారి పేర్లు లేకపోతే నమోదు చేసుకునేలా అవగాహన కల్పించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో ఈ నెల 12న ఉదయం 9 గంటలకు పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహం నుంచి పాత బస్టాండ్ వరకు యువ ఓటర్లు, విద్యార్థులు, యువత భాగస్వామ్యంతో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహిస్తామని తెలియజేశు. సాయంత్రం 4 గంటలకు అంబేడ్కర్ క్రీడాప్రాంగణంలో రంగోలీ పోటీలు, కైట్ ఫెస్టివల్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 17 వరకు నియోజకవర్గాల్లో బైక్, సైకిల్ ర్యాలీలు, ట్రాన్స్‌జెండర్లు, సెక్స్‌వర్కర్లకు ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తామని, 18న విద్యాసంస్థల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. ఈ నెల 19వ తేదిన స్వయం సహాయక సంఘాలు, దివ్యాంగులు, వృద్ధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించిన ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తామని వివరించారు. ఈ సంవత్సరం జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఈ నెల 22 వరకు ఓటరు నమోదు, మార్పులు చేర్పులకు అవకాశం ఉన్నదని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.







అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

వెల్దుర్తి, జనవరి 11: మండల పరిధిలోని మెల్లూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. బుధవారం ఎంపీపీ స్వరూప ఈ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, స్టాక్ రిజిస్టర్‌కు, కేంద్రంలో ఉన్న సరుకుల నిల్వలకు మధ్య తేడా ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత ఈ అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్‌లో, కేంద్రంలో ఉన్న నిల్వ సమానంగా ఉందని, ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి తదితరులు ఉన్నారు.

'అధికారులను సస్పెండ్ చేయాలి'

హవేళిఘనపూర్, జనవరి 11: జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో పని చేస్తున్న అధికారులు నరేష్, నరసింహారావును సస్పెండ్ చేయాలని మండల కేంద్రంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు వ్యకాస జిల్లా కార్యదర్శి మల్లేశం గురువారం వినతిపత్రం అందజేశారు. 2022 సంవత్సరంలో వివిధ ప్రమాదాల్లో మరణించిన 38మంది మత్స్య కార్మికులకు ఆ అధికారుల కారణంగా ప్రమాద బీమా డబ్బులు రాలేదన్నారు. క్లెయిమ్ చేసేందుకు వారికి డబ్బులు ఇవ్వనందునే బీమా డబ్బులు రాకుండా చేశారని ఆరోపించారు. వారిని వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో బాధితులు బాబు, సులోచన, బాలరాజు తదితరులున్నారు.

'పెండింగ్ వేతనాలు ఇప్పించండి'

సంగారెడ్డి రూరల్, జనవరి 11 : తమకు రావాల్సిన పెండింగ్ వేతనాలు ఇప్పించి ఆదుకోవాలని రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)లు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసి విన్నవించారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆర్పీలు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఫార్మసిస్టుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

సంగారెడ్డి అర్బన్, జనవరి 11 : తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్టుల అసోసియేషన్ జిల్లా ఎన్నికలు గురువారం జరిగాయి. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఈర్న భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగిన ఎన్నికలో జిల్లా అధ్యక్షుడిగా రఘు, కార్యదర్శిగా జ్యోతి, కోశాధికారిగా వినోద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జగదీశ్‌స్వామి, ఉపాధ్యక్షులుగా మల్లయ్య, జబ్బార్, ముజాహిద్, కుమారస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సురేశ్, జాయింట్ సెక్రటరీలుగా వెంకటేశం, శివకుమార్, శ్యామ్‌శంకర్, కసిని నాగరాజు, మెంబర్లుగా మాధవి, నర్సింలు, కల్పన, అనిత తదితరులు ఎన్నికయ్యారు.

నల్లపోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు

కౌడిపల్లి, జనవరి11: తునికి నల్లపోచమ్మ ఆలయ హుండీని ఆలయ అధికారులు గురువారం లెక్కించారు. గత సంవత్సరం జూలై 13 నుంచి ఈనెల 10 వరకు వచ్చిన హుండీ కానుకలను దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శివరాజ్, ఇన్‌స్పెక్టర్ రంగరాజుల సమక్షంలో ఆలయ ఈఓ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీలో వచ్చిన నగదును బ్యాంకులో జమ చేస్తామన్నారు.

టేక్మాల్‌లో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు

టేక్మాల్, జనవరి 11: టేక్మాల్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. పాఠశాలకు సెలువు ఉన్న రోజు ఆధార్ కేంద్రం మూసి ఉంటుందని తెలిపారు.

ఆధునిక పద్ధతులను పాటించాలి

రామాయంపేట, జనవరి 11: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా వ్యవసాయాధికారులు రైతులకు ఆధునిక పద్ధతులపై సూచనలు, సలహాలు చేశారు. మండల పరిధి ధర్మారం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఏఓ రాజ్ నారాయణ వివరించారు.



ఎంఆర్ఐ ఏర్పాటు కోసం ఇంకెన్నాళ్లు వేచి చూడాలో!?

- సంగారెడ్డి జీజీహెచ్‌లో ఎంఆర్ఐకు భారీ డిమాండ్
- స్కానింగ్ అవసరమైతే గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు సిఫారసు
- అత్యవసరమైతే ప్రైవేటుకు
- మెడికల్ కాలేజీ ఏర్పాటుతో ఎంఆర్ఐపై ఆశలు

సంగారెడ్డి అర్బన్, జనవరి 11 : శరీరంలోని ఆరోగ్య సమస్యలు ఎక్స్‌రేలు, సీటీ స్కానింగ్‌ల్లో బయట పడపోతే ఎంఆర్ఐ(మ్యాగ్నెటిక్ రిసోనెన్స్ ఇమేజింగ్) పరీక్ష ద్వారా తెలుసుకోవచ్చు. దానికనుగుణంగా వైద్యం చేయడానికి వెసులుబాటు ఉంటుంది. గడ్డలు మెదడు, నరాలు, కండరాల సమస్యలు, వెన్నుపూస, ఎముకల సమస్యలు, పక్షవాతం, తలకి తీవ్ర గాయం, ఫిట్స్ తదితర సమస్యలు ఎంఆర్ఐలో స్పష్టంగా తెలుస్తాయి. వీటి ఆధారంగా డాక్టర్లు సరైన చికిత్స ప్రారంభించాల్సి ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఎంఆర్ఐ స్కానింగ్ ప్రస్తుతం జిల్లాలోని ఏ ఒక్క ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో లేదు. రెండేళ్ల కిందట జిల్లా కేంద్రంలోని సంగారెడ్డిలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారు. దానికి అనుబంధంగా 400 పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఉన్నది. ఈ మధ్య ఎంఆర్ఐ స్కానింగ్‌కు భారీ డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో జీజీహెచ్‌లో ఎంఆర్ఐ స్కానింగ్ ఏర్పాటు ఆవశ్యకత ఉన్నది.



సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

ఓపీకి నిత్యం వెయ్యి మంది

ఇలా ఉండగా సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి నిత్యం వెయ్యి మంది వరకు రోగులు వైద్య సేవల కోసం వస్తుంటారు. జిల్లాలోని నారాయణఖేడ్, జహీరాబాద్, పటాన్‌చెరు, జోగిపేట, సదాశివపేట ప్రాంతాల నుంచే కాకుండా పక్కనున్న వికారాబాద్, మోమిన్‌పేట, శంకర్‌పల్లి, మెదక్, బీదర్ తదితర ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడి వస్తుంటారు. నెలకు సుమారు 800 ప్రసవాలు, వందల సంఖ్యలో వివిధ రకాల ఆపరేషన్లు జరుగుతుంటాయి. అంతే కాకుండా జిల్లా నుంచి రెండు జాతీయ రహదారుల మార్గాలున్నాయి. వందల మంది క్షతగాత్రులు చికిత్సకు ఇక్కడికి వస్తారు. ఇంతటి ప్రధానమైన ఈ జీజీహెచ్ ఆస్పత్రికి వచ్చే రోగుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని ఎంఆర్ఐ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎంఆర్ఐ కోసం హైదరాబాద్, లేదా ప్రైవేటుకు

ఎంఆర్ఐ స్కానింగ్ పరికరం స్థానికంగా అందుబాటు లేకపోవడంతో హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా, ఇతర పెద్ద ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలని డాక్టర్లు సూచిస్తున్నారు. అక్కడికి వెళ్లలేని రోగులు దగ్గరలోని ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటులో ఎంఆర్ఐకు రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఆర్థిక భారంతో ప్రైవేటుకు వెళ్లలేక, చాలా మంది ఎంఆర్ఐ స్కానింగ్ తప్పనిసరైన వారు 60 కి.మీ దూరం ప్రయాణించి గాంధీ, ఉస్మానియాకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థోమత లేని బాధితులు ఎంఆర్ఐ చేయించుకోలేక నానా అవస్థలు పడుతూ అలాగే ఉండిపోతున్నారు.

మెడికల్ కాలేజీ ఏర్పాటుతో ఎంఆర్ఐపై ఆశలు

ఇటీవలి కాలంలో ఎవరి నోటా విన్నా ఎంఆర్ఐ స్కానింగ్ చర్చే జరుగుతున్నది. ఏ ఇంట్లో చూసినా ఎవరో ఒకరు అనారోగ్య బారిన పడడం, డాక్టర్ దగ్గరికి వెళ్తే వారికి ఎంఆర్ఐ నివేదిక తప్పనిసరి చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ పరంగా స్థానికంగా ఎంఆర్ఐ స్కానింగ్ పరికరం అందుబాటులో లేదు. ఎన్నో ఏళ్లుగా ఎంఆర్ఐ స్కానింగ్ కోసం బాధితులు ఎదురుచూస్తున్నారు. కొత్త ఎంఆర్ఐ పరికరం కొనుగోలు చేయాలంటే రూ.10 నుంచి రూ.15 కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చించాల్సి ఉంటుంది. ఏదేమైనా అత్యంత ప్రాధాన్యంగా మారిన ఎంఆర్ఐ స్కానింగ్ కోసం ఇప్పుడు డిమాండ్ పెరిగింది. మెడికల్ కాలేజీ ఏర్పాటైన నేపథ్యంలో ఎంఆర్ఐ స్కానింగ్ అందుబాటులోకి తీసుకురావాలని ఆ దిశగా ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని బాధితులు కోరుతున్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఫిర్యాదు

- స్పీకర్, ప్రభుత్వ సీఎస్, కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు

సంగారెడ్డి టౌన్, జనవరి 11 : ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిలకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్, కలెక్టర్‌లకు ఆయన లేఖలు పంపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొనే బాధ్యత ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధిగా తనపై ఉన్నదని చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ నెల 10న సంగారెడ్డిలోని టీఎన్‌జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యేగా తాను హాజరైనప్పటికీ, డీసీసీ అధ్యక్షురాలి కోసం నిరీక్షించడం, ఆమె వచ్చే వరకు కార్యక్రమాన్ని మొదలుపెట్టకపోవడం తనకు, లబ్ధిదారులకు ఇబ్బంది కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాల పై సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని చింతా ప్రభాకర్ కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అసెంబ్లీ స్పీకర్, జిల్లా కలెక్టర్‌లకు పంపిన లేఖల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు.

రైతులకు అనుసంధానకర్తలుగా నిలవాలి

- సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి


శిక్షణ పొందిన ఇన్‌పుట్ డీలర్లకు సర్టిఫికెట్లను అందజేస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

సంగారెడ్డి రూరల్, జనవరి 11 : రైతులకు శిక్షణ పొందిన ఇన్‌పుట్ డీలర్లు అనుసంధానకర్తలుగా నిలవాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం వ్యవసాయ శాఖ అధ్వర్యంలో ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ రైతులకు అనవసంగా ఎరువులు, పురుగు మందులు ఇవ్వకూడదని, సేంద్రీయ ఎరువులు వాడేలా అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు పెట్టుబడి తగ్గించి దిగుబడి పెంచే పద్ధతులను తెలపాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన డీలర్లకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి నర్సింహారావు, డీపీడీ రామకృష్ణ, రమేష్, శ్రీనివాస్, గులామ్ మహ్మద్, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో శ్రీనివాస క్లినిక్ సీజ్


సంగారెడ్డిలో శ్రీనివాస్ క్లినిక్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవి

సంగారెడ్డి అర్బన్, జనవరి 11 : వైద్య ఆరోగ్య శాఖ నుంచి ఆయుర్వేదిక్ వైద్యం కోసం అనుమతి తీసుకుని హల్లోపతి వైద్యం చేస్తున్న సంగారెడ్డి పాత బస్టాండ్ అంబేద్కర్ చౌక్ సమీపంలోని శ్రీనివాస క్లినిక్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవి గురువారం సీజ్ చేశారు. తనిఖీకి వెళ్లిన క్రమంలో బీఏఎంఎస్ డాక్టర్ ప్రభాకర్ హల్లోపతి వైద్య చేస్తున్నట్టు గుర్తించిన అధికారులు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవి మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రైవేట్ హల్లోపతి, ఆయుర్వేదిక్ క్లినిక్‌లకు వైద్య ఆరోగ్య శాఖ అనుమతి తప్పనిసరన్నారు. అనుమతులులేనివారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తనిఖీల్లో పట్టుబడితే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఆయూష్ డాక్టర్లు ఆయూష్ ట్రీట్మెంట్ మాత్రమే చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వి.రవి, డెమో ప్రసాద్‌వీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువును పరిశీలించిన అధికారులు


చెరువును సందర్శించిన డీఎఫ్‌వో, ఇరిగేషన్, మత్స్య శాఖ అధికారులు

జిన్నారం, జనవరి 11: జిన్నారం రాయుని చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వేసిన ఫెన్సింగ్ ప్రహరిని ఫారెస్టు, ఇరిగేషన్, మత్స్య శాఖ అధికారులు పరిశీలించారు. గురువారం జిన్నారం రాయుని చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ప్రహరిని డీఎఫ్‌వో శ్రీధర్‌రావు, ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రెడ్డి, మత్స్య శాఖ అధికారి సతీష్, స్థానిక నాయకులు పరిశీలించారు. మూడేళ్ల క్రితం రాయుని చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రహరి నిర్మించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం పట్ల మత్స్యకారులు, స్థానిక నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇటీవల జిల్లా పరిషత్ సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. ఆమె ఆదేశాలతో మూడు శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. కాగా ఫారెస్టు, ఇరిగేషన్ శాఖల అధికారులు ప్రహరి ఏర్పాటు చేసిన స్థలం తమ శాఖలదేనని పేర్కొన్నారు. కాగా జిల్లా కలెక్టర్‌కు సమగ్ర నివేదిక అందజేస్తామని ఆయా శాఖల అధికారులు పేర్కొన్నారు.

ఎఫ్‌టీఎల్‌లోని అక్రమ నిర్మాణాల కూల్చివేత


బోర్పట్ల గ్రామంలో అక్రమంగా ఏర్పాటు చేసిన హద్దురాళ్లను కూల్చివేయిస్తున్న అధికారులు

హత్నూర, జనవరి 11: హత్నూర మండల పరిధిలోని బోర్పట్ల గ్రామ శివారులోని భీముని చెరువు ఎఫ్‌టీఎల్ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను గురువారం రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో ఉన్న నిర్మాణాలను ఎక్స్‌వేటర్‌తో తొలగించారు. ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని నీటిపారుదల శాఖ డీఈఈ రవికుమార్, ఏఈ భూపుత్ర, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సర్వేయర్ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి రాకేష్ కుమార్ హెచ్చరించారు.

నిధులు మంజూరుకాక ఆగిపోయిన పనులు

- ముందుకు సాగని మైనార్టీ భవన నిర్మాణం

మనోహరాబాద్, జనవరి 11: మండలంలో పలు చోట్ల పేరుకే జడ్పీనిధులు కేటాయించడంతో పనులు ముందుకు సాగడం లేదు. మండలంలోని చాలా గ్రామాల్లో అనేక సంఘాల భవనాలకు జడ్పీ నిధుల నుంచి నిధులు మంజూరు చేశారు. కానీ నిధులు విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో 9 నెలల క్రితం జడ్పీ చైర్‌పర్సన్ హేమలతశేఖర్‌గౌడ్ మైనార్టీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీనికి సుమారు 20 లక్షల రూపాయలను జడ్పీ నిధుల నుంచి మంజూరు చేశారు. కానీ మొదటి విడతగా 10 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రొసీడింగ్ పత్రాల్చారు. 10 నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఒక్క చెక్కు కూడా జమ కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలో ఆపివేశాడు. ఇదిలా ఉండగా దండుపల్లి గ్రామ పంచాయితీ భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి సుమారు 5 లక్షల రూపాయలు మంజూరు చేశారు. కానీ కాంట్రాక్టర్ లేక పనులు ఇంత వరకు మొదలు కాలేదు. మండలంలో చాలా చోట్ల సరైన సమయానికి నిధులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదు. రంగాయపల్లి గ్రామంలో 6 నెలల కింద శిలాఫలకం వేసి చేతులు దులుపుకున్నారు. రంగాయపల్లి గ్రామంలో ఎస్సీ కమ్యునిటీ హాల్‌కు 8 నెలల క్రితం జడ్పీ చైర్‌పర్సన్ హేమలతశేఖర్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.10 లక్షల వరకు భవనానికి మంజూరు చేశారు. కానీ ప్రస్తుతం పనులిక్కా ప్రారంభ దశలోనే ఉన్నాయి. మరో ఆరు నెలలో జడ్పీ చైర్‌పర్సన్ పదవీ కాలం ముగుస్తున్నందున నిధుల మంజూరుపై సందిగ్ధత నెలకొంది.


కాళ్లకల్ గ్రామంలో అసంపూర్తిగా మిగిలిన మైనార్టీ భవన నిర్మాణం

భూమిశిస్తుకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు ఓబన్న

- మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, జనవరి 11: భూమిశిస్తుకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు ఓబన్న అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా కొనియాడారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉయ్యాలవాడ నరసింహ రెడ్డి స్థాపించిన సైన్యానికి సైన్యాధిపతిగా ఉంటూ.. పోరాటాలు చేశారన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఓబన్న పాత్ర కీలకమని, వారి వీరోచిత పోరాటాల స్ఫూర్తిని భావితరాలకు చాటి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అధికారి నాగరాజు, మనోహర్, సుమన్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆస్పత్రి కార్మికులకు పెరిగిన వేతనాలు అమలు చేయాలి

- సీఐటీయూ నాయకుల డిమాండ్
- సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా

సంగారెడ్డి అర్బన్, జనవరి 11 :పెంచిన వేతనాలు చెల్లించాలని కోరుతూ కార్మికులు సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులకు రూ.15,600 వేతనం చెల్లింపులు చేస్తుంటే కాంట్రాక్టు సంస్థ మాత్రం రూ.10,500 చెల్లిస్తుందన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, కార్మికులను రెగ్యూలరైజ్ చేయాలని కోరారు. వెంటనే పెంచిన వేతనాలను కాంట్రాక్టు సంస్థలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, కిరణ్, శోభ, మరియమ్మ, రమాదేవీ, రాజు, భవానీప్రసాద్ తదితరలు పాల్గొన్నారు.


సంగారెడ్డి జీజీహెచ్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సౌకర్యాలు లేని సంక్షేమ హాస్టళ్లు

- ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్ నేతల ఆరోపణ

మెదక్, జనవరి 11: విద్యార్థి వసతిగృహాలు సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్ నేతలు ఆరోపించారు. గురువారం మెదక్‌లోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. హాస్టల్ విద్యార్థులకు మినరల్ వాటర్ సౌకర్యం కల్పించాలన్నారు. దోమలు కారణంగా రాత్రి వేళల్లో విద్యార్థులకు నిద్ర ఉండడం లేదని వెంటనే దోమతెరలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన దుప్పట్లను సరఫరా చేయకపోవడంతో విద్యార్థులు చలికి తట్టుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల నిర్వహన లేమి కారణంగా దుర్గంధం వెదజల్లుతున్నాయన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు మెయిన్‌టెనెన్స్ కింద ఇచ్చే రూ.500లు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బాల్‌రాజ్, కిరణ్, కిషోర్, అశోక్, రమేష్, నరేందర్, నాగరాజు, రవి, సుకుమార్ పాల్గొన్నారు.


మెదక్‌లోని వసతిగృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్ నేతలు

కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు న్యాయం చేయాలి

- ఎంపీపీ జంగం శ్రీనివాస్, ప్రజాప్రతినిధుల డిమాండ్


తహసీల్దార్ గ్రేస్‌బాయ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ, ప్రజాప్రతినిధులు

పెద్దశంకరంపేట, జనవరి 11:పెద్దశంకరంపేట మండలపరిధిలోని ఆయాగ్రామాల కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు గురువారం తహసీల్దార్ గ్రేస్‌బాయ్‌కి వినతిపత్రం సమర్పించారు. కల్యాణలక్ష్మి పథకం ద్వారా మండలంలో పలువురు లబ్ధిదారులకు చెక్కులు మంజూరు అయ్యాయని, వాటిని వెంటనే లబ్ధిదారులకు అందించాలని వారు పేర్కొన్నారు. అలాగే పెద్దశంకరంపేట తిరుమలాపూర్ శివారులోని సర్వేనెంబర్లు 237, 238, 254 లో అధికారులు సర్వేనిర్వహించి, ప్రభుత్వ భూములను కాపాడాలన్నారు. ఈ సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారి నుంచి వెంటనే స్థలాలను తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలని మండల ప్రజాప్రతినిధులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ఎంపీపీ లక్ష్మీరమేష్, ఎంపీటీసీ వీణాసుభాష్‌గౌడ్, దత్తు, మండలసర్పంచుల ఫోరం అధ్యక్షుడు కుంట్ల రాములు, సర్పంచులు, నాయకులు నరేష్, రవీందర్, రమేష్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

జిన్నారం, జనవరి 1: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఇద్దరు మోడల్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. మోడల్ పాఠశాలకు చెందిన ఖుషి, ఇంటర్ విద్యార్థి బిక్కి రాష్ట్ర స్థాయిలో పాల్గొనే కబడ్డీ జిల్లా జట్టు నుంచి పోటీలో పాల్గొంటారని తెలిపారు.


ఖుషి, బిక్కి

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

హత్నూర, జనవరి 11: చెట్టుకు ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుర్కలఖానాపూర్ గ్రామ శివారులో గురువారం చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన చాకలి ప్రభాకర్(30) జీవనోపాధి కోసం సంగారెడ్డి పట్టణంలో నివాసం ఉండేవాడు. కొన్ని రోజుల క్రితం స్వగ్రామమైన వడ్డేపల్లి గ్రామానికి వచ్చాడు. వ్యక్తిగత కారణాల వల్ల గురువారం తుర్కలఖానాపూర్ గ్రామ శివారులోని చెట్టుకు వైరుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో హత్నూర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా చేశారు. మృతుడి భార్య చాకలి మహేశ్వరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.


ప్రభాకర్ (ఫైల్)

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరి మృతి

హత్నూర, జనవరి 11: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన హత్నూర మండలం దేవులపల్లి బస్టేజీ సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... దేవులపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులుగౌడ్, శంకర్‌గౌడ్ ఒక ద్విచక్ర వాహనంపై దౌల్తాబాద్ నుంచి హత్నూర వైపు వెళ్తున్నారు. అటు నుంచి ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై నస్తీపూర్ గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారి గోపాల్, నర్సమ్మ దంపతులు వస్తున్నారు. రెండు దేవులపల్లి బస్టేజీ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో శంకర్‌గౌడ్(40) అక్కడికక్కడే మృతి చెందగా.. గోపాల్, నర్సమ్మతో పాటు ఆంజనేయులుగౌడ్‌లకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుభాష్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నర్సాపూర్ మార్చురీకి తరలించి, పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.


శంకర్‌గౌడ్ (ఫైల్)

వివేకానందుడి బాటలో నడవాలి

- ఏబీవీపీ మెదక్ విభాగ్ ఆర్గనైజేషన్ సెక్రటరీ బొడ లక్ష్మణ్

సంగారెడ్డి అర్బన్, జనవరి 11: ప్రతి ఒక్క విద్యార్థి, యువత వివేకానందుడి బాటలో నడవాలని ఏబీవీపీ మెదక్ విభాగ ఆర్గనైజేషన్ సెక్రటరీ బొడ లక్ష్మణ్ సూచించారు. స్వామి వివేకానంద 161వ జయంతిని ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సంగారెడ్డిలోని ఐబీ వద్ద వివేకానం విగ్రహానికి ఆయన పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని జాగృతం చేయడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండ్‌ల్లో యోగ, వేదాంత శాస్త్రాలను తన ఉపన్యాసాల ద్వారా పరిచయం చేసిన ఖ్యాతి స్వామి వివేకానందకే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఆకాశ్, తానాజీ, శశాంక్, దినేష్, అనూష, భానుప్రకాశ్, నిఖిల్, వెంకట్రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సంగారెడ్డిలోని ఐబీ వద్ద వివేకానంద విగ్రహానికి నివాళులర్పించిన ఏబీవీపీ నాయకులు

ఐటీఐ కళాశాలలో వివేకానంద జయంతి

గుమ్మడిదల, జనవరి 11 : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని స్థానిక గుమ్మడిదల వీరభద్ర ఐటీఐ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ మాట్లాడుతూ భారత దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేసిన యోధుడు వివేకానందుడన్నారు. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన యువకులు దేశానికి అవసరమని, స్వామి వివేకానందాన్ని యువత ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను అందుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి కల్యాణ్, జగదీష్, శ్రీకాంత్, భరత్, రోజా, శ్రీవాణి విద్యార్థులు పాల్గొన్నారు.


గుమ్మడిదల ఐఐటి కళాశాలలో స్వామి వివేకానంద గురించి విద్యార్థులకు వివరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్

మెదక్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి: ఎమ్మెల్యే

మెదక్, జనవరి 11: మెదక్ జిల్లా కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన క్యాంపు కార్యాలయంలో మెదక్ సిటిజన్స్ ఫోరం నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక యువతకు ఉపాధి కల్పించడానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్నదని ఫోరం కన్వీనర్ కొండల్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. సీఐ మధును ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. చిరువ్యాపారులను దృష్టిలో ఉంచుకుని, రహదారికి ఇరువైపులా తెలుపు రంగుతో లైనింగ్ వేసి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. ఇందిరా స్టేడియం నుంచి తరలిపోయిన అథ్లెటిక్ అకాడమీని గచ్చిబౌలీ స్టేడియం నుంచి తిరిగి రప్పించాలని ఫోరం నేతలు కోరగా అందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. మెదక్ పట్టణంలో పార్కుల ఏర్పాటుకు అధికారులను ఆదేశిస్తానన్నారు. సమావేశంలో ఫోరం నేతలు నర్సింహులు, గణేష్, భుజంగరెడ్డి, పీడీ ఆనందం, దశరథం, బాలేష్ గౌడ్, నాగరాజు, దయాసాగర్, జీవరత్నం, సామ్యూల్ పాల్గొన్నారు.

ఆస్పత్రి అడ్వయిజరీ కమిటీ సమావేశం

నర్సాపూర్, జనవరి 11: నర్సాపూర్ ఆస్పత్రి వద్ద గురువారం అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సునితారెడ్డి హాజరై మాట్లాడారు. రోగులకు ఇబ్బందులు లేకుండా సేవలందించాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల డాక్టర్లు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఆస్పత్రిలో సరిపడా వైద్యులు, సిబ్బంది లేక ఆశించిన స్థాయిలో సేవలు అందించలేక పోతున్నామని డాక్టర్ పావని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వైద్యులు, సిబ్బంది కొరత తీర్చడానికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. సమావేశంలో డీఈసీహెచ్ డాక్టర్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో చందునాయక్, మున్సిపల్ చైర్మన్ నయీముద్దీన్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు

- విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

సంగారెడ్డి రూరల్/మెదక్/నారాయణఖేడ్/నర్సాపూర్/జహీరాబాద్/చేగుంట/వెల్దుర్తి, జనవరి 11: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం పలు పాఠశాలల్లో ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గులపోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు. నారాయణఖేడ్ మండలం రుద్రారం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. హెచ్ఎం.రవీందర్, ఉపాధ్యాయులు జగదీశ్వర్, గోవింద్, కాశీనాథ్, శివాజీ, శివకుమార్ బహుమతులను అందజేశారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి విద్యానగర్‌లోని సేయింట్ ఆంథోనీస్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఆంథోనిరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రమిల పాల్గొన్నారు. నర్సాపూర్ మండలంలోని బ్రహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి వేడుకలు విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలో వేజేతలకు హెచ్ఎం శ్రీశైలం, ఉపాధ్యాయులు మల్లయ్య శివశంకర్, శ్రీనివాస్ బహుమతులను అందజేశారు. జహీరాబాద్ పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో సామాజిక వేత్త, చారీటబుల్ ట్రస్టు అధినేత పైడి ఎల్లారెడ్డి పాల్గొని, ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అస్లాం ఫారూఖీ, అధ్యాపకులు పాల్గొన్నారు. చేగుంట మండలంలోని చిన్న శివనూర్, చేగుంట జిల్లా పరిషత్ హైస్కూల్, వల్లభాపూర్ ప్రాథమిక పాఠశాల, చేగుంట రిషి మెమోరియల్ స్కూల్ విద్యార్థినులకు ముగ్గుల పోటీలు, పతంగి పోటీలు నిర్వహించారు. వల్లభాపూర్‌లో మండల నోడల్ అధికారి నీరజ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, పరమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జగన్‌లాల్, శశిధర్‌రెడ్డి, చల్లా లక్ష్మణ్, సమత, రవీందర్, అనంతశర్మ, రాజశేఖర్‌రెడ్డి, సౌమ్య పాల్గొన్నారు. మెదక్‌లోని సిద్ధార్థ స్కూల్‌లో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సతీమణి శివానీరెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలు నిర్వహించి, బహుమతులను అందజేశారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య బహుమతులను అందజేశారు. వెల్దుర్తిలోని బాష్యం విద్యా మందిర్‌లో సంక్రాంతి సంబురాలు నిర్వహించారు.



జహీరాబాద్‌లో విజేతలకు చెక్కులను అందజేస్తున్న ఎల్లారెడ్డి



రుద్రారంలో విద్యార్థినులు వేసిన ముగ్గులు



వెల్దుర్తిలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు





వల్లభాపూర్, పోతిరెడ్డిపల్లి విద్యానగర్‌లోని పాఠశాలల్లో హరిదాసు వేషధారణలో విద్యార్థులు

డయల్ 100కు స్పందించి నిండు ప్రాణాన్ని కాపాడిన పోలీసులు

సంగారెడ్డి క్రైం, జనవరి 11: డయల్ 100కు వచ్చిన ఫోన్ కాల్‌కు స్పందించిన పోలీసులు 26 నిమిషాల్లో ఓ వ్యక్తి ప్రాణాన్ని కాపాడారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం... జహీరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని తన అన్నకు ఫోన్‌చేసి తెలియజేశాడు. ఆందోళనకు గురైన అన్న మధ్యాహ్నం 3.33గంటలకు డయల్ 100కు ఫోన్ చేసి, తన తమ్ముడిని కాపాడాలని కోరారు. వెంటనే స్పందించిన జహీరాబాద్ ఎస్ఐ శ్రీకాంత్, ఐటీ కోర్ సిబ్బంది సహాయం తీసుకున్నారు. ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తి ఫోన్ నంబర్‌తో లోకేషన్‌ను ట్రేస్ చేయగా పుల్కల్ మండలం సింగూరు ప్రాజెక్టు వద్ద ఉన్నట్లు గుర్తించారు. ఈ సమాచారాన్ని పుల్కల్ ఎస్ఐ క్రాంతికి తెలియజేశారు. ఆయన సింగూరు ప్రాజెక్టు సిబ్బందికి సమాచారం ఇచ్చి, సిబ్బంది లక్ష్మణ్, నరేష్‌తో కలిసి మధ్యాహ్నం 3.59గంటలకు అక్కడి వెళ్లారు. సింగూరు ప్రాజెక్టులో దూకిని వ్యక్తిని క్షేమంగా ఒడ్డుకు చేర్చి ప్రాణాలను కాపాడారు. సదరు వ్యక్తిని పుల్కల్ పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. జిల్లా పోలీసులు, సింగూరు ప్రాజెక్టు సిబ్బందిని ఎస్పీ చెన్నూరి రూపేష్ అభినందించారు.

రాంనగర్‌లో మట్కా నిర్వాహకుడి అరెస్టు

- రూ.లక్ష నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం

జహీరాబాద్, జనవరి 11: జహీరాబాద్ పట్టణంలోని రాంనగర్‌లో మట్కా నిర్వాహకుడు మహ్మద్ రఫీని గురువారం అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాంనగ్‌కు చెందిన మహ్మద్ రఫీ మట్కాను ఆడిస్తున్న క్రమంలో తమ సిబ్బంది గమనించి పట్టుకున్నారని చెప్పారు. అతడి నుంచి రూ.లక్ష నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని ఎస్ఐ తెలిపారు. రఫీని రిమాండ్‌కు పంపించామన్నారు.

విద్యార్థి దశలోనే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి



తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నగదు బహుమతిని అందజేసిన ప్రిన్సిపాల్, లయన్స్ క్లబ్ సభ్యులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 11: విద్యార్థి దశలోనే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని లయన్స్ క్లబ్ సంగారెడ్డి ఆదర్శ అధ్యక్షుడు వెంకటేశం తెలిపారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో లియో క్లబ్స్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత విద్యాశాఖ గత కమిషనర్ నవీన్‌మిట్టల్ సహకారంతో కళాశాలలో లియోక్లబ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే దేనినైనా సాధించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, పోస్టర్ పెయింటింగ్ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. లయన్స్ క్లబ్ సభ్యుడు విజేందర్‌రెడ్డి కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగానికి వంట పాత్రల నిమిత్తం రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అల్లంరెడ్డి, సభ్యులు రామప్ప, కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం పంచాయతీకి వీఆర్‌ఏలను కేటాయించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్ లావణ్య

జిన్నారం, జనవరి 11: జిన్నారం పంచాయతీకి వీఆర్ఏలను కేటాయించాలని రెవెన్యూ అధికారులకు పంచాయతీ పాలకులు వినతిపత్రాన్ని అందజేశారు. గురువారం సర్పంచ్ లావణ్య, నాయకులు రాజిరెడ్డి, బ్రహ్మేందర్ తదితరులు డిప్యూటీ తహసీల్దార్ పరమేశ్వర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామంలో వీఆర్ఏలు అందుబాటులో లేక సమస్యలు నెలకొంటున్నాయని, పంచాయతీకి ఇద్దరు వీఆర్ఏలను కేటాయించాలని కోరారు. అనంతరం గ్రామ సర్పంచ్ లావణ్య, స్థానిక నాయకులు ఎస్టీ గురుకు పాఠశాలను సందర్శించి, విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు.

రేపు సర్వధర్మ సమ్మేళనం

నారాయణఖేడ్, జనవరి 11: దివంగత స్వాతంత్ర్య సమరయోధుడు శివ్‌రావు షెట్కార్ 28వ వర్ధంతిని పురస్కరించుకొని నారాయణఖేడ్‌లో ఈ నెల 13న సర్వధర్మ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొంకణం దాస్ వర్ధంతి

నారాయణఖేడ్, జనవరి 11: మండల పరిధిలోని తుర్కపల్లిలో గురువారం కొంకణం దాస్ మహరాజ్ 95వ వర్ధంతిని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. ఆయన వెంట సర్పంచు స్రవంతిపరమేశ్వర్, ఉప సర్పంచు సాయిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు భూమయ్య, తుకారం ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నారాయణఖేడ్: స్వాతంత్ర్య సమరయోధుడు శివ్‌రావు షెట్కార్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం నారాయణఖేడ్‌లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ ప్రణాళిక సభ్యుడు నగేష్‌షెట్కార్ ప్రారంభించారు.

అసెన్డు భూముల్లో వేసిన ప్లాట్లపై చర్యలు తీసుకోవాలి

నర్సాపూర్: పట్టణ పరిధిలో పలు అసెన్డు భూముల్లో అక్రమంగా ప్లాటు చేస్తున్నారని బీజేపీ నాయకులు ఆర్డీవో శ్రీనివాసుకు ఫిర్యాదు చేశారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, పట్టణ పార్టీ అధ్యక్షుడు అంజాగౌడ్ ఉన్నారు.

సుధార్‌సింగ్ చవాన్‌కు డాక్టరేట్



సంగారెడ్డి రూరల్, జనవరి 11: సంగారెడ్డిలోని ప్రొఫెసర్ జయశంకర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేసే సుధార్‌సింగ్ చవాన్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డాక్టరేట్ సాధించారు. డాక్టరేట్ పట్టాను మధ్యప్రదేశ్ సిహోర్‌లోని శ్రీ సత్యసాయి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మెడికల్ సైన్సెస్ ఫిబ్రవరిలో జరిగే స్నాతకోత్సవంలో అందుకోనున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది.

కొమురవెల్లిలో కళాకారుల ఆందోళన

చేర్యాల, జనవరి 11: తమ ఇలవేల్పు దైవమైన కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయానికి తమను రానీయకుండా అడ్డుకుంటూ పలువురు స్థానిక ఒగ్గు పూజారులు అన్యాయం చేస్తున్నారని, ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరుతూ హైదరాబాద్ ఒగ్గుకథ, జానపద కళాకారులు గురువారం మల్లన్న ఆలయ ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయాధికారులతో పాటు కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. పురాతన కాలంలో కొద్దిపాటి జనసంచారంతో ఉండే ఆలయానికి తాము హైదరాబాద్ నుంచి భక్తులను జాతరకు తీసుకొచ్చి ఆలయాభివృద్ధికి పాటుపడుతున్నామని తెలిపారు. స్థానిక ఒగ్గుపూజారులు తమను అడ్డగించడంతో డబ్బులు అధికంగా డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. తోటి కళాకారులుగా తమను గుర్తించాల్సింది పోయి నిక్కృష్టంగా ప్రవర్తిస్తున్నారని, తమతో ప్రేమ పూర్వకంగా మెదిలేలా చర్యలు తీసుకుని ఆనవాయితీని పరిరక్షించాలని కోరారు.

పాపన్న నాయకత్వంలో మరో పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 11: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (మాదిగ దండోరా) రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న నాయకత్వంలో మరో పోరాటానికి సిద్ధం కావాలని జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మేడి పాపన్న ఆదేశం మేరకు జిల్లా కమిటీ ఎన్నికల సమావేశం గురువారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా అధ్యక్ష, కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు, డప్పు, చెప్పు పెన్షన్, మాదిగ పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్లో పెట్టడమా..? రాష్ట్రాలకు అధికారాలు ఇవ్వడమా.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తేల్చాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లాలో మాదిగల సమగ్రాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా సంఘం పనిచేస్తున్నదని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్‌లో మాదిగల భవనానికి ఎకరం స్థలం కేటాయించి కోటి రూపాయల బడ్జెట్‌ను విడుదల చేయాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి భూపాల్, రాజమల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి వెంకట్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయండి లేదంటే తప్పుకోండి

- అధికారులకు ఎమ్మెల్యే రోహిత్ సూచన
- హవేళిఘణపూర్‌లో సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

హవేళిఘణపూర్, జనవరి 11: అధికారులు నిబద్ధతతో పనిచేయాలని, లేదంటే తను చెబితే వేరేచోటుకి బదిలీ చేయిస్తానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు హితవు పలికారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శేరి నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచులు సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులు తూతూ మంత్రంగా ప్రగతి నివేదికలను చదవటంకాదని, సరైన సమాచారంతో వచ్చి సభ్యులు వివరించాలని సూచించారు. సభ్యులు చెప్పిన సమస్యలను ఖచ్చితంగా పరిష్కరించాలని ఆదేశించారు. కాగా బూర్గుపల్లి గ్రామాన్ని దత్తత తీసుకున్నాని, సకల సౌకర్యాలతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. అవసరం ఉన్న చోట బ్రిడ్జిలు, రహదారులు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి తనకు అందజేయాలని ఆర్అండ్‌బీ ఏఈకి సుచించారు. అధికారులు, ప్రజలు, నాయకులు, అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే రోహిత్‌రావును సన్మానించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీరామ్, తహసీల్దార్ నారాయణ, ఏవో నాగమాధురి, మండల కో ఆప్షన్ సభ్యుడు ఖాలేద్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- అధికారుల సూచన



రేగోడు తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న జోగిపేట ఆర్డీవో పాండు

నారాయణఖేడ్/జహీరాబాద్/జోగిపేట/రేగోడు/న్యాల్‌కల్, జనవరి 11: 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ నూతన ఓటరుగా నమోదు చేసుకోవాలని జహీరాబాద్ ఆర్డీవో వెంకారెడ్డి, జోగిపేట ఆర్డీవో పాండు, నారాయణఖేడ్ ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, న్యాల్‌కల్ తహసీల్దార్ భానుకిరణ్ సూచించారు. గురువారం ఆయా పట్టణాల్లో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. రెండు చోట్ల ఓటరుగా నమోదై ఉంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహకంలో భాగంగా ఈ నెల 6నుంచి 22 వరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణలు చేపడుతున్నందున ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 28న ఓటరు తుదిజాబితాను విడుదల చేస్తామని వివరించారు. రేగోడులో తహసీల్దార్ బాలలక్ష్మి, ఆర్ఐ ఫిరోజ్, రాములు, రవి పాల్గొన్నారు. అందోలులో తహసీల్దారు ఆంటీనీ, ఆర్డీవో కార్యాలయ ఏవో స్వర్ణలత పాల్గొన్నారు. న్యాల్‌కల్‌లో డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఘనంగా పొలాల అమావాస్య



నాగల్‌గిద్ద మండలం ఉట్‌పల్లిలో పొలాల అమావాస్య వేడుకల్లో పాల్గొన్న ప్రజలు

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, జనవరి 11: ఖేడ్ ప్రాంతంలో గురువారం పొలాల అమావాస్య వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రబీ సీజన్‌లో వివిధ రకాల పంటలు చేతికి అందే సమయంలో లక్ష్మీదేవిని ఆహ్వానించడం కోసం ఏటా మార్గశిర మాసంలో వచ్చే అమావాస్య రోజున శూన్యం అమావాస్య పర్వదినాన్ని జరుపుకుంటారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని పొలాల్లో పండిన వివిధరకాల పంటలతో ప్రత్యేకంగా తయారు చేసిన భజ్జీ కూర, రొట్టెలతో కుటుంబం సమేతంగా పొలాలకు వెళ్లి పొలాల్లో ప్రత్యేకంగా చిన్నపాటి గుడిసెలు వేసి లక్ష్మీదేవికి పూజలు చేస్తారు. అనంతరం బంధువులతో కలిసి పొలాల్లోనే భోజనాలు చేస్తారు. నారాయణఖేడ్ ప్రాంతంలోని వివిధగ్రామాల్లో రైతులు శూన్యం అమావాస్య పండగను ఘనంగా జరుపుకున్నారు. పొలాల అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని నాగల్‌గిద్ద మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పొలాల వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భజ్జీకూరను వంటి కుటుంబ సమేతంగా పొలాలకు వెళ్లి లక్ష్మీదేవికి పూజలు చేశారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు.

ఉపాధి హామీ పనులపై ప్రజాదర్బార్

- అందోలు మండలలో 407 పనులు

జోగిపేట, జనవరి 11: అందోలు మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ గురువారం జోగిపేటలో ప్రారంభమైంది. మండలంలో 407 పనులను చేపట్టగా, కూలీలకు రూ.3.91 కోట్ల చెల్లింపులు జరుగగా, రూ.27.09 లక్షల మేర మెటీరియల్ కాంపౌండ్ ఇచ్చారు. వీటిలో ఆరు పనులకు సంబంధించి లెక్కలు సమర్పించలేదని అడిషనల్ డీఈఆర్‌డీవో మోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సౌజన్యారావు, తాజా మాజీ ఎంపీడీవో సత్యనారాయణ, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, ఎస్ఆర్‌పీ కొండల్, ఎస్‌టీఎంలు సాయి, జానేందర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సర్పంచులు ఇతర ప్రజాప్రతినిధులు, కూలీలు హాజరయ్యారు.

కౌడిపల్లిలో

కౌడిపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యలయ ఆవరణలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ హాజరయ్యారు. ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత ఉండాలని సూచించారు. గత సంవత్సరం నుంచి చేపట్టిన పనుల్లో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీహరి, అంబుడ్స్‌మెన్ ప్రభాకర్, క్వాలిటి కంట్రోలర్ రమాకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో పుణ్యదాస్ పాల్గొన్నారు.





కౌడిపల్లి, గుమ్మడిదలలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న అధికారులు



ఉపాధి హామీ పనులపై జోగిపేటలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పాల్గొన్న అధికారులు

గుమ్మడిదలలో

గుమ్మడిదల: గుమ్మడిదల మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై ప్రజా దర్బార్ నిర్వహించారు. అధికారులు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఇప్పటివరకు ఉపాధి హామీ కింద జరిగిన పనులను సమీక్షించారు. ఉపాధి హామీ ద్వారా కూలీలు చేపటాల్సిన పనులపై అధికారులు చర్చించి ప్రజాప్రతినిధులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో గుమ్మడిదల సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, గుమ్మడిదల పాలకవర్గ సభ్యులు కాలకంటి రవీందర్‌రెడ్డి, సరెడ్డిగారి జైపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాములు, జాతీయ ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధి హామీ పథకం కూలీలు పాల్గొన్నారు.

యువజనోత్సవాల్లో ద్వితీయ బహుమతి



స్ఫూర్తి

మెదక్ అర్బన్, జనవరి 11: రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో మెదక్ జిల్లా విద్యార్థిని స్ఫూర్తి ద్వితీయ బహుమతి సాధించిందని జిల్లా యువజన, క్రీడలశాఖాధికారి నాగరాజు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లోని శిల్పారామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలకు వివిధ జిల్లాల నుంచి పలు అంశాల్లో 34 మంది పాల్గొన్నారు. గీతా జూనియర్ కళాశాలకు చెందిన స్ఫూర్తి ఉపన్యాస పోటీల్లో రెండో బహుమతి సాధించిందని తెలిపారు. స్ఫూర్తిని కళాశాల కరస్పాండెంట్ ప్రసాదరావు, ప్రిన్సిపాల్ సాయిరాం అభినందించారు.

వేతనాలు ఇప్పించాలని కాంట్రాక్టు లెక్చరర్ల వినతి

మెదక్, జనవరి 11: పెండింగ్ వేతనాలు ఇప్పించాలని డిగ్రీ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్లు గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ను కలిసి విన్నవించారు. ఐదు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఉన్నత విద్యా కమిషనర్ బుర్రా వెంకటేశంతో ఫోన్‌లో మాట్లాడారు. తమ కళాశాల లెక్చరర్లు వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జీతాలు అందేలా ఏర్పాటు చేస్తానని కమిషనర్ బదులిచ్చారు. అనంతరం ప్రిన్సిపాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు వినోద్‌కుమార్, పశుపతిశర్మ, రాజు, సుధారాణి, హరిత పాల్గొన్నారు.

జీవన గమనం తెలిపేదే భగవద్గీత

నారాయణఖేడ్, జనవరి 11: మానవాళికి జీవన గమనం తెలిపేదే భగవద్గీత అని భర్డీపూర్ ఆశ్రమ పీఠాధిపతి అవధూత్ గిరి మహరాజ్ అన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని దత్తాత్రేయ మందిరంలో నిర్వహిస్తున్న గీతా పారాయణ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. భగవద్గీతలోని ప్రతీ శ్లోకంలో మానవుడి జీవన విధానానికి అవసరమైన అంశాలు ఉన్నాయన్నారు. గీతను ఆచరిస్తే సక్రమ మార్గంలో పయనించగల్గుతారన్నారు. నారాయణఖేడ్‌లో గీతా పారాయణం ప్రతీ రోజు నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, ఆశ్రమ కమిటీ సభ్యులు కాశీనాథ్‌పటేల్, కౌన్సిలర్ వివేకానంద్ పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దశంకరంపేట, జనవరి 11: పీఆర్టీయూటీఎస్ పెద్దశంకరంపేట క్యాలెండర్‌ను గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా గరవాధ్యక్షుడు రామచంద్రాచారి, మండల నోడల్ ఆఫీసర్ వెంకటేశం, ఎంవోఎంటీ నోడల్ ఆఫీసర్ రాజేశ్వర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సుభాష్, విఠల్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి చంద్రప్రకాష్, సత్యకుమార్, మండల అధ్యక్షుడు గోపి, ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



పెద్దశంకరంపేటలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం